
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 21 మే 2024
3



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	41.4	23.5
భద్రాద్రి	40.0	25.0



ఖమ్మంలో జరిగిన 'పట్టభద్రుల' సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన అభ్యర్థి రాకేష్‌రెడ్డి

ప్రశ్నించే గొంతుకకే
పట్టం కట్టాలి

- గత ఎన్నికల్లో కాంగ్రెస్ అబద్ధాల ప్రచారంతో ఓడిపోయాం..
- పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి చరిత్ర సృష్టిద్దాం
- విద్యావంతుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

4



ఖమ్మంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

ఆదరించండి..
అండగా ఉంటా

- ఉప ఎన్నిక తెచ్చిన బీఆర్ఎస్‌ను ఓడించాలి
- నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తా
- ప్రజల కోసం కొట్లాడి జైలులో వున్నా..
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

4



ఖమ్మంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

అబద్ధాల కాంగ్రెస్‌కు
గుణపాఠం చెప్పాలి

- హామీలు అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారు?
- ఉద్యోగులు, నిరుద్యోగులకు మొండిచేయి చూపుతున్నారు
- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలి
- మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

4

భగభగ మండే ఎండలకు, అత్యధిక ఉష్ణోగ్రతలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పెట్టింది పేరు. వేసవి వచ్చిందంటే చాలు.. అందరి చూపు ఖమ్మం జిల్లా వైపే ఉంటుంది. భౌగోళిక కారణాల రీత్యా ఇక్కడ ఏడాదికేడాది ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలు మండాయంటే ఆ ప్రభావం జనజీవనంపైనా ఉండటం సహజం. భానుడి ప్రతాపం నుంచి కాపాడుకునేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే వడదెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రభుత్వం ప్రతీ వేసవి సీజన్‌లో ప్రచారం చేస్తుంటుంది. అయినా జనం వడదెబ్బ బారిన పడటం, ప్రాణాలు కోల్పోవడం ప్రతీ ఏటా చోటు చేసుకుంటూనే ఉంటాయి. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో ఒక్క వడదెబ్బ మరణం కూడా సంభవించలేదని వారు అధికారికంగా సెలవిస్తున్నారు. వారి తీరు చూస్తుంటే.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అసలు ఎండలే కాయలేదనీ, ఉష్ణోగ్రతలు చాలా తక్కువ స్థాయిలో నమోదు అయ్యాయని నమ్మక తప్పదేమో అనిపిస్తోంది.

ఇంత లెక్కలేనితనమా!?



- నిల్ రిపోర్టు ఇచ్చిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు
- గడిచిన ఐదేళ్లుగా ఇదే తీరు
- కనీసం నివేదిక ఇవ్వని పీహెచ్‌సీల అధికారులు
- క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్న నిర్లక్ష్య వైఖరి
- జాడలేని త్రిసభ్య కమిటీ విచారణలు
- గతంలో పదుల సంఖ్యలో మరణించినట్టు రిపోర్టులు

ఉమ్మడి జిల్లాలో ఒక్క వడదెబ్బ మరణమూ లేదట

ఖమ్మం, మే 20 (ఆంధ్రజ్యోతి): వేసవి వేళ పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులది. అంతేకాదు ఎవరైనా వడదెబ్బ తగిలి అనారోగ్యంతో మృతి చెందితే వారి మృతిని నమోదు చేసి వెంటనే సంబంధిత వ్యక్తి మరణం దేనివల్ల సంభవించిందనే విషయాన్ని స్పష్టం చేస్తూ నివేదిక అందించాల్సిన బాధ్యత కూడా వారిపై ఉంటుంది. పీహెచ్‌సీల స్థాయిలో అధికారులు ముందుగా వడదెబ్బకు సంబంధించిన సమాచారంతో నివేదిక సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆ మరణాలను వైద్యఆరోగ్య అధికారి, పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్, తహసీల్దార్ దానిని వడదెబ్బగా నిర్ధారించాలి. కానీ గడిచిన ఐదేళ్ల కాలంలో వైద్యశాఖ అధికారులు వడదెబ్బ మరణాలను రిపోర్టు చేయడమే మానేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో పదికిపైగా వడదెబ్బ మరణాలు సంభవించినట్టుగా వార్తలు వచ్చినప్పటికీ వారి అధికారిక లెక్కల్లో ఒక్కటి కూడా లేదని చూపించడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఖమ్మం జిల్లాలో 2020లో 12, 2021లో రెండు మరణాలు సంభవించాయనీ రిపోర్టు చేయగా అవి వడదెబ్బ మరణాలు కాదని త్రిసభ్య కమిటీ నిర్ధారించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అయితే అసలు రిపోర్టు చేయకపోవడం గమనార్హం.

జాడలేని త్రిసభ్య కమిటీలు

వడదెబ్బ మరణాల్లో గత కొన్నేళ్లుగా అధికారులు నివేదికలు ఇవ్వని విషయమే అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో సంభవించే మరణాలను ఎప్పటికప్పుడు రికార్డు చేసి రాష్ట్రస్థాయి విపత్తు యాజమాన్యానికి నివేదించేందుకు విపత్తు విభాగం ఉంటుంది. అయితే ఆ విభాగం వారు వడదెబ్బ మరణాలను రికార్డు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలతో నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం, అధికారులనుంచి హెచ్చరికలు పంపడం, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన ఆస్తి, ప్రాణ నష్టాల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించడం విపత్తుల విభాగం పని.

జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా ఎండలు మండిపోయి, మృత్యువాత పడుతున్నప్పటికీ అధికారులు దీనిపై కనీసం స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. వడదెబ్బతో పాటుగా ప్రకృతి వైపరీత్యాలతో మరణాలు సంభవించినప్పుడు వైద్యశాఖ అధికారి, పోలీస్ అధికారి, తహసీల్దార్లు ఘటనా స్థలాలకు వెళ్లి విచారణ జరిపి నివేదికను పంపాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం అలాంటి కమిటీలు జిల్లాలో కనిపించని పరిస్థితి ఏర్పడింది. వడదెబ్బ మరణాల విషయంలోనూ ఇదే జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వడదెబ్బతో మరణించిన కుటుంబ సభ్యులు తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ వచ్చాక అసలు పట్టించుకోలే...

పదేళ్ల క్రితం వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వందల సంఖ్యలో వడదెబ్బ మృతులకు సంబంధించిన నివేదికలు ఉండేవి. వాటిల్లో పదుల సంఖ్యలో మరణాలను వడదెబ్బ మృతులుగా త్రిసభ్య కమిటీ గుర్తించేది. అలా 2016లో ఉమ్మడి ఖమ్మం జిల్లా కలిసి ఉన్న సమయంలో 433 మరణాలను జరిగినట్టు నివేదిక రూపొందించగా.. వాటిల్లో 61మంది వడదెబ్బతో చనిపోయినట్టుగా త్రిసభ్య కమిటీ గుర్తించడం కొసమెరుపు. ఆ తర్వాత జిల్లాల విభజన జరిగిన అనంతరం ఆయా మరణాల నివేదికల్లో సైతం పలు మార్పులు చోటుచేసుకున్నాయి. కాలక్రమేణా నివేదికలు తగ్గించుకుంటూ రావడంతోపాటు త్రిసభ్య కమిటీ గుర్తించే వడదెబ్బ మృతుల సంఖ్య కూడా తగ్గుతూ వచ్చింది. కొద్దికాలంపాటు ఒకటి రెండు మరణాలు చూపుతూ వచ్చిన అధికారులు.. గడిచిన ఐదేళ్ల కాలం నుంచి అసలు మరణాలే లేవని లెక్కలు చూపించడం మొదలుపెట్టారు. మూడేళ్ల క్రితం నుంచి పీహెచ్‌సీల వైద్యులు నేరుగా కేంద్రప్రభుత్వానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోవడమే మానేశారు. ఫలితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వడదెబ్బ మరణాలే లేనట్టుగా లెక్కలు ఉంటున్న పరిస్థితి ఏర్పడింది. అయితే అసలు నివేదికలే ఇవ్వనప్పుడు నిర్ధారణ ఎలా జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ ఏడాది వడదెబ్బ అనుమాన మృతుల్లో కొన్ని...

- కొత్తగూడెం రామవరానికి చెందిన ఈదునూరి కన్నయ్య భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ఉండేవాడు. పనిలో భాగంగా పాల్వంచలోని బాపూజీనగర్‌కు వెళ్లగా మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండటంతో అకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై కన్నయ్య కుమార్తె రోజారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం నివేదిక కూడా సమర్పించలేదు.
- చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన మల్లు వెంకటి కూలీ పనులు చేస్తుండగా.. ఎండవేడికి తాళలేక అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- ఎర్రుపాలెం మండలం పెద్దగోపవరానికి చెందిన రాసమంటి వెంకటకృష్ణ పశువుల కాపరిగా జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో ఎండదెబ్బకు గురై రెండు రోజులపాటు అనారోగ్యంపాలై మృతి చెందాడు.
- అడవి రామవరానికి చెందిన సున్నం సమ్మక్క వరిపంట నూర్పిడికి వెళ్లి వడదెబ్బకు లోనై చనిపోయింది.

ఇలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదుల సంఖ్యలో వడదెబ్బ మృతులు జరిగినట్టుగా వార్తలు వచ్చినప్పటికీ వాటిని సంబంధిత అధికారులు కనీసం నివేదిక ఇవ్వకపోవడం గమనార్హం.



సదాశివపురంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

సంక్షేమ పథకాల అమలులో
రాజీపడం

- తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తా...
- పాలేరు ప్రజల రుణం తీర్చుకుంటా
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, మే 20: సంక్షేమ పథకాల అమలులో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని, నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. 'ప్రజల చెంతకే మీ శీనన్న' కార్యక్రమంలో భాగంగా సోమవారం నేలకొండపల్లి మండల పరిధిలోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగరం, సదాశివపురం, పాతకొత్తూరు, నాచేపల్లి గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కక్షపూరితంగా చాలా పనులు ఆపేశారన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి తనకు అద్భుతమైన విజయాన్ని అందించారన్నారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ అందరి కోసం పనిచేస్తానన్నారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో తాను చేసే అభివృద్ధిని చూసి మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం లేకుండానే ప్రజలు గెలిపించేలా చేస్తానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, అలా కాకుండా రానున్న రోజుల్లో అర్హులైన ప్రతీ పేదవానికి పక్కా ఇల్లు కట్టిస్తానన్నారు. పార్టీలకు అతీతంగా పేదల్లో అతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలేరులో ఏ ఒక్కరూ తాగునీటికి ఇబ్బంది పడకూడదన్నదే తన ఆలోచనని, ఆ దిశగా చర్యలు తీసుకుంటానన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. పాలేరు ప్రజలు తనను అక్కున చేర్చుకుని ఊహించిన దానికంటే ఎక్కువ మెజార్టీ ఇచ్చారని, వారి రుణం తీర్చుకోలేనన్నారు. పాలేరు తనకు స్వంత ఇల్లు లాంటిదని, ఎల్లప్పుడూ పాలేరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానన్నారు. కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, శాఖమూరి రమేష్, యడవల్లి సైదులు, వెన్నపూసల సీతారాములు, మామిడి వెంకన్న, ముండ్ర నాగప్రసాద్, రామకృష్ణ, కుక్కల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎఫ్‌సీకి తనిఖీల షాక్

- చికెన్ డ్రమ్‌స్టిక్, చికెన్ పాప్‌కార్న్ శ్యాంపిల్ సేకరణ
- నాణ్యతా ప్రమాణాలపై ఫిర్యాదుకు ఆహారశాఖ స్పందన

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 20: నాన్ వెజ్ ప్రియులకు చికెన్ అంటే మహా మక్కువ. అందుకే చికెన్ ఫుడ్ ఐటమ్స్ విక్రయించే షాపులకు యమ గిరాకీ ఉంటోంది. అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన కేఎఫ్‌సీ సంగతి అందరికీ తెలిసిందే. చికెన్ ప్రియులు కేఎఫ్‌సీ ఐటమ్స్‌ను టచ్ చేయకుండా ఉండలేరు. ఇప్పుడు ఖమ్మంలోని అదే కేఎఫ్‌సీ ఓ వివాదంలో చిక్కుకొంది. కేఎఫ్‌సీలో చికెన్ ఆహార పదార్థాల నాణ్యతను పాటించ లేదని, నాసిరకమైన ఆహార ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్నారని ఖమ్మానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల రాష్ట్ర ఆహార తనిఖీశాఖ డైరెక్టర్‌కు ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. చికెన్ వంటకాల్లో 15శాతం మరగాల్సిన ఆయిల్‌ను 22శాతానికి పైగా మరిగిస్తూ ఆహార ఉత్పత్తులను తయారు చేయటాన్ని గుర్తించారు. దీంతో నాణ్యతా ప్రమాణాలు పాటించని చికెన్ డ్రమ్‌స్టిక్, చికెన్ పాప్‌కార్న్ రెండు శ్యాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.



ఫుడ్ శ్యాంపిల్స్ సేకరిస్తున్న గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్

మసకబారిన మత్స్య ప్రభ

- నామమాత్రంగా మారిన వైరా మత్స్య విత్తనోత్పత్తి కేంద్రం
- నిధులు ఇవ్వరు.. సిబ్బందిని కేటాయించరు...
- శిథిలావస్థకు చేరిన నర్సరీలు
- ఒకప్పుడు ఇతర జిల్లాలకు సైతం చేప పిల్లల సరఫరా
- నేడు ఆదరణ లేక వెలవెల



5

ఉమ్మడి ఏపీలో ఒక వెలుగు వెలిగిన ఖమ్మం జిల్లా వైరాలోని మత్స్య విత్తనోత్పత్తి కేంద్రం పాలకుల నిర్లక్ష్యం, నిరాదరణతో నామమాత్రంగా మారింది. ఏడు దశాబ్దాల కిందట వైరాలో ఏర్పాటు చేసిన ఈ మత్స్య విత్తనోత్పత్తి కేంద్రం.. చేప పిల్లల ఉత్పత్తి, సరఫరాలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇక్కడి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకే కాకుండా, ఇతర జిల్లాలకు కూడా చేప పిల్లలను సరఫరా చేసేవారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం చేపట్టిన తర్వాత.. వైరా మత్స్య విత్తనోత్పత్తి కేంద్రం క్రమంగా తన ప్రాధాన్యాన్ని కోల్పోతూ వచ్చింది. నిధులు, సిబ్బంది కేటాయింపు లేకపోవడంతో 2019నుంచి ఉనికినే కోల్పోయింది. మత్స్యకారులకు ఎంతో ఆదరువుగా నిలిచిన ఈ కేంద్రానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా పునర్వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉంది. - వైరా

బెంగుళూరు రేవ్ పార్టీలో ఖమ్మం వాసి

- పోలీసుల అదుపులో నిందితుడు?

ఖమ్మం, మే 20 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో సోమవారం ఓ రేవ్ పార్టీపై పోలీసులు దాడిచేసిన ఘటనలో పలువురు పట్టుబడగా, వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి కుమారుడు ఉన్నట్టు ప్రచారం జరగడం కలకలం రేపింది. ఓ వ్యక్తి బర్త్ డే సందర్భంగా రేవ్ పార్టీ ముసుగులో డ్రగ్స్ వాడుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ పార్టీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 140మందికి పైగా పాల్గొన్నట్టు తెలిసింది. వీరిలో పలువురు సినీ ఆర్టిస్టులు, వ్యాపారవేత్తలు, మరికొందరు ప్రముఖులు ఉన్నట్టు సమాచారం. పట్టుబడిన వారిలో ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఓ రాజకీయ నాయకుడి కుమారుడు ఉన్నట్టు బయటకు పొక్కడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిందితుడి సోదరుడు ఖమ్మంలో ప్రముఖ డాక్టర్‌గా పేరు పొందారు. రేవ్ పార్టీలు చట్టవిరుద్ధ, అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలుస్తున్న విషయం విదితమే. హైదరాబాద్‌లో పోలీసుల నిఘా పెరగడంతో రేవ్‌పార్టీని బెంగుళూరులో ఏర్పాటుచేసినట్టు తెలిసింది. అయితే పట్టుబడిన యువకుడి పేరు, ఖమ్మం నాయకుడి కుమారుడి పేరు ఒకే విధంగా ఉండటంతో అయోమయం నెలకొంది. పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడిస్తే గానీ విషయం స్పష్టమయ్యే అవకాశం లేదు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్

- ఆరుగురిపై కేసు నమోదు... ముగ్గురి అరెస్టు
- నిందితుల్లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, సీనియర్ అసిస్టెంట్ మోయిజ్ అలీ

ఖమ్మం, మే 20 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించిన ఘటనలో ఖమ్మం టూ టౌన్ పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఖమ్మం ఖానాపురం హవేలి రెవెన్యూ పరిధిలోని సర్వే 304/ఆ లోని 450 గజాల స్థల వివాదానికి సంబంధించి బాణాల శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బల్లేపల్లికి చెందిన షేక్ షైబు, నౌషద్ ఖాన్, షేక్ షబిహా సుల్తానా, దుమ్ముగూడెం మండలానికి చెందిన రావులపల్లి రవికుమార్, టీఎన్జీవో అధ్యక్షుడు అఫ్జల్ హసన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మోయిజ్ అలీలపై కేసు నమోదు చేశారు. వారిలో షైబు, షబిహా సుల్తానా, రవికుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా.. నౌషద్ ఖాన్, అఫ్జల్ హసన్, మోయిజ్ అలీలు పరారీలో ఉన్నట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి...

» మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

ఖమ్మం కార్పొరేషన్, మే 20: పట్టభద్రుల ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని మాజీమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి ఖమ్మం వచ్చిన ఈటల సోమవారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అబద్ధాలు చెప్పటంలో కాంగ్రెస్ నేతలు సిద్ధహస్తులన్నారు. రాష్ట్రంలోని మహిళలకు రూ.2500 ఇస్తానని ప్రకటించి ఇవ్వలేని కాంగ్రెస్... దేశంలో మహిళలకు రూ.8500 ఎలా ఇస్తామని హామీ ఇచ్చారని ఈటల ప్రశ్నించారు. తాను ఎన్నికల ప్రచారంలో పర్యటిస్తున్నప్పుడు ప్రతి ఉద్యోగి, నిరుద్యోగులైన పట్టభద్రులు వారి సమస్యలను తన దృష్టికి తెచ్చారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించాలని తనను కోరారన్నారు. వారి తరఫున సీఎం తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ఆర్టీసీ ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ తేదీని ఎప్పుడు ఖరారు చేస్తారో సీఎం సమాధానం చెప్పాలన్నారు. మహాలక్ష్మి పథకం సొమ్ములు చెల్లించకపోవటంతో ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు సకాలంలో వేతనాలు రావటం లేదని, దీనికి ముఖ్యమంత్రి ఏం సమాధానం చెబుతారని ఈటెల ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఇస్తానన్న రూ.4వేల భృతి చెల్లించకుండా ఎలా ఓట్లు అడుగుతారన్నారు. ఎన్నికల హామీలో ప్రకటించిన ఉద్యోగులకు నాలుగు డీఏలు, అలాగే పీఆర్సీపై స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. పీఆర్సీ పాతబకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ కార్డులు ఎక్కడా పనిచేయటంలేదని, ఆ కార్డులు తీసుకువెళ్లిన ఉద్యోగులకు ఆస్పత్రుల్లో అవమానాలు జరుగుతున్నాయన్నారు. జీపీఎఫ్‌లో దాచుకున్న తమ సొమ్ములను తీసుకోలేని దుస్థితిలో ఉద్యోగులు ఉన్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7500 కోట్లకు చేరాయని, కళాశాల యాజమాన్యాలు దీనస్థితిలో ఉన్నాయని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లలో ఉద్యోగులకు ఆరునెలలుగా వేతనాలు రావటంలేదని, ప్రముఖ పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఉద్యోగులకు, నిరుద్యోగులైన పట్టభద్రులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలేజీ, స్కూల్ యాజమాన్యాలను బెదిరించి ఓట్లు వేయించాలని మంత్రులే చెబుతున్నారని ఆరోపించారు. అతి తక్కువ కాలంలోనే ప్రజల చేత సీఎం రేవంత్‌రెడ్డి ఛీ కొట్టించుకున్నారన్నారు. సిద్ధాంతాలను నమ్ముకొని పనిచేస్తున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, నాయకులు గెంటేల విద్యాసాగర్‌రావు, ఉప్పల శారద, నంబూరి రామలింగేశ్వరరావు, బీవీ పాటిల్, శీలం పాపారావు, మంద సరస్వతి, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేథావుల మౌనం.. సమాజానికి హానికరం

» బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి


మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

ఇల్లెందు, మే 20: శాసన మండలి ఎన్నికల్లో మేథావులు మౌనంగా ఉండటం మంచిది కాదని. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం బీజేపీనే గెలిపించాలని పట్టభద్రుల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఇల్లెందులో సోమవారం పట్టభద్రుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశం యావత్తు నరేంద్ర మోదీ వైపు చూస్తోందన్నారు. రాష్ట్రంలో మోసపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను దగా చేసిందన్నారు. ఉద్యోగులు యువకుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విఫలమయ్యాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు తెలంగాణ చైతన్యాన్ని, ఉద్యమస్ఫూర్తిని చూపాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారామ్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, మాజీ ఎమ్మెల్యే మార్తిని ధర్మారావు, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎస్.హైమరెడ్డి. తదితరులు ప్రసంగించారు.

ప్రశ్నించే గొంతుకకే పట్టం కట్టాలి

మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


కార్యకర్తలకు షేక్‌హ్యాండ్ ఇస్తున్న కేటీఆర్


ప్రచార సభకు హాజరైన గ్రాడ్యుయేట్లు, అభిమానులు

ఖమ్మం, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించి ప్రశ్నించే గొంతుకకే పట్టభద్రులు పట్టం కట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కే.తారకరామారావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో గెలుపు అనేది అభివృద్ధి ఒక్కటితో సాధ్యం కాదని, అభిమానం కూడా అవసరమని ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధికి పదికి పది సీట్లు గెలవాలి, కానీ గెలవలేకపోయాం. ప్రజల అభిమానం పొందలేకపోయాం, ఈసారి పట్టభద్రుల ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టిద్దామన్నారు.

ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాల ఆవరణలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎన్నికల ప్రచార సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. అబద్దాల కాంగ్రెస్ మోసాలపైనా విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా గళమెత్తే గొంతుకగా విద్యావంతుడు రాకేష్‌రెడ్డిని పట్టభద్రులంతా ఆశీర్వదించి శాసనమండలికి పంపించాలని కోరారు. అమెరికాలో ఉన్నత చదువులు చదివి పలు ఉద్యోగాలు చేసి తెలంగాణపై అభిమానంతో వచ్చి ఇక్కడ ప్రజలతో మమేకమవుతూ శాసనమండలి ఎన్నికల్లో పోటీలో నిలిచారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను ఓడించి గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని రీతిలో బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో 2 లక్షల ఉద్యోగాలు కల్పించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ఇచ్చిన ఉద్యోగాల గురించి చెప్పుకోలేకపోయామని ఇప్పుడు రేవంత్‌రెడ్డి వందరోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఒక్క నోటిఫికేషన్ ఇవ్వని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 30వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చిందని చెబుతారు.. అని పెళ్లికాకుండానే పిల్లలు కంటారా అంటూ నిలదీశారు. విద్యావంతుడు, చైతన్యవంతుడైన రాకేష్‌రెడ్డిని గెలిపించాలని, బ్లాక్‌మెయిలర్‌గా పేరొందిన తీన్మార్ మల్లన్నను ఓడించాలని కోరారు. రాకేష్‌రెడ్డి గెలుపు ద్వారా శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు విషయంలో నిలదీసే అవకాశం ఉంటుందని జాబ్ క్యాలెండర్, 2లక్షల ఉద్యోగాలు, 4 వేలు నిరుద్యోగుల పెన్షన్ వంటి వాటి గురించి ప్రశ్నిస్తారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వరంగల్, ఖమ్మంలో ఐటీహబ్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కలిపించామన్నారు. వరంగల్‌లో టెక్ మహీంద్రా కంపెనీ తెస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ కంపెనీ వెళ్లిపోయిందని, హైదరాబాదులో కూడా అనేక కంపెనీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయన్నారు. పెద్దల సభలకు విద్యావంతులు, మేథావులు వెళ్లాల్సి ఉండగా మోసగాళ్లు, 56 కేసులతో 74 రోజులు జైలు కెళ్లిన వారిని పంపిస్తారా అంటూ నిలదీశారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి విద్యావంతుడైన రాకేష్‌రెడ్డికి ఓటువేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం విభజన చట్టంలో ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదని, బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదని, అటువంటి బీజేపీకి శాసనమండలిలో ఓటు అడిగే హక్కులేదన్నారు. తక్కువ సమయంలో భారీ సభ ఏర్పాటుకు సహకరించిన గుండాల కృష్ణను అభినందించారు.

బీఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రసంగిస్తూ ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లా పట్టభద్రులు ఈ శాసనమండలి ఎన్నికల్లో నిజం వైపు ఉంటారో అబద్ధం వైపు ఉంటారో, ఆశయం వైపు ఉంటారా....అహంకారం వైపు ఉంటారా... త్యాగం వైపు ఉంటారో, ద్రోహం వైపు ఉంటారో తేల్చుకోవాలని, నిజం, ఆశయం, త్యాగం బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిలో ఉన్నాయని ఆయన్ని గెలిపించాలని కోరారు. 56 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి బాలికలను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ఫీజురీయింబర్స్‌మెంట్ ఏ కాలేజీకి చెల్లించలేదని, విద్యార్థులు చదువుకు ఎలాంటి సహాయం అందించని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎస్‌బీఐటీ కళాశాల అధినేత, బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి గుండాల కృష్ణ తదితరులు ప్రసంగిస్తూ గత అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపించి అబద్దాల గ్యారంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన గ్యారంటీలు ఏ ఒక్కటీ అమలుకాలేదని, శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు విద్యావతుండైన రాకేష్‌రెడ్డికి పట్టం కట్టాలని తెలిపారు. ఈ సభలో జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, మదన్‌లాల్, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఉప్పల వెంకటరమణ, బీఆర్ఎస్ కార్పొరేటర్ల పక్షనాయకుడు కర్నాటి కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తిచేయాలి

సత్తుపల్లిరూరల్, మే20: సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో నిర్మితమవుతున్న పనులు ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన ఆకస్మికంగా సత్తుపల్లిలో పర్యటించి మండలంలోని కిష్టారం, రేజర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో విద్యుత్, వాల్ పేయింటింగ్, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఆర్. నాగేశ్వరరావు, ఎంఈవో బీ.రాములు, ఎంపీవో కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలూ.. అర్హతకు మించి సేవలు వద్దు

నేలకొండపల్లి, మే 20: గ్రామీణ వైద్యులు తమ అర్హతకు మించిన వైద్య సేవలను అందించకూడదని, అలా తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం నేలకొండపల్లిలోని గ్రామీణ వైద్యుల క్లినిక్‌లను ఆయన తనిఖీ చేశారు. గ్రామీణ వైద్యులు ఎక్కువ మోతాదు గల మందులను వాడుతున్నారని, అర్హతకు మించి వైద్యం చేస్తున్నారని అందిన ఫిర్యాదుల మేరకు ఈతనిఖీలు జరిగినట్లు సమాచారం. నేలకొండపల్లిలోని రెండు క్లినిక్‌లను వారు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు అర్హతకు మించిన వైద్యం చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. క్లినిక్‌లలో పడకలుండకూడదని అన్నారు.

ఆదరించండి
అండగా ఉంటా...

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 20: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఓటేసి ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే పదవీ కాలం ముగియకముందే మరో పదవిని తెచ్చుకొని, ఉప ఎన్నికను తెచ్చి పట్టభద్రులను అవమానపర్చారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విమర్శించారు. తనను ఆదరించి ఎమ్మెల్సీగా తొలి ప్రాధాన్య ఓటేస్తే అండగా ఉంటానని అభ్యర్థించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీలు కపిలవాయి దిలీప్‌కుమార్, బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను తొలి ప్రాధాన్య ఓటు ద్వారా గెలిపించాలని కోరారు. టీపీసీసీ సభ్యులు జావీద్, రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, నగర కార్యనిర్వాహక అధ్యక్షులు దీపక్‌చౌదరి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ప్రచారం

ఖమ్మం లీగల్: జిల్లాకోర్టు ప్రాంగణంలో సోమవారం తీన్మార్ మల్లన్న న్యాయవాదులను, న్యాయశాఖ ఉద్యోగులను ఓటు వేయమని అభ్యర్థించారు. నగర మేయర్ నీరజ, లీగల్ సెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

త్వరలో జాబ్ క్యాలండర్...

ఇల్లందు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బిఆర్ఎస్‌లకు ఓట్లు అడిగే హక్కు లేదని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలండర్ ప్రకటిస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో సోమవారం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను ప్రజల కోసం కొట్లాడి జైల్లో ఉన్నా.. నీ బిడ్డ సారా దందాలో జైలులో వుంది..' అని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మగౌరవం పెంచే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ కేటీఆర్ మాటలకు మోస పోవద్దని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ఏ శక్తులూ అడ్డుకోలేవన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, మువ్వ విజయ్‌బాబు, మునిసిపల్ చైర్మన్ డీవీ నాగిరెడ్డి తదితరులు ప్రసంగించారు.


రాయల వెంకటశేషగిరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్

రాజకీయ అనుభవజ్ఞుడు రాయల

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తల్లాడ, మే 20: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు, అభివృద్ధి ప్రదాత డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ కొనియాడారు. సోమవారం తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో రాయల వెంకటశేషగిరిరావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ముందుగా శేషగిరిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శేషగిరిరావు సతీమణి పద్మావతి, కుమారులు రఘునందన్, రేవంత్‌లను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేషగిరిరావుకు కేసీఆర్‌తో దశాబ్దాల సాన్నిహిత్యం ఉందని, అనారోగ్యంతో శేషగిరిరావు మరణించారనే వార్త తమకు బాధ కలిగించిందన్నారు. చనిపోయిన రోజు అనివార్య కారణాల వల్ల శేషగిరిరావు కుటుంబాన్ని పరామర్శించలేకపోయామని, ఈరోజు బీఆర్ఎస్ జిల్లా ప్రముఖులతో కలిసి పరామర్శించి శేషగిరిరావుతో ఉన్న గత స్మృతులను నెమరువేసుకున్నట్టు తెలిపారు. అతని జీవితమంతా రైతుల కోసం, సత్తుపల్లి నియోజకవర్గం, జిల్లా అభివృద్ధికి వెచ్చించారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకోసం ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదపడతామని, కుటుంబ సభ్యులు, అభిమానులు మనోధైర్యంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయకుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు దిరిశాల ప్రమీల, సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డం వీరమోహనరెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, ఎంపీటీసీ సభ్యులు కోపెల కనకయ్య, బీఆర్ఎస్ మండల నాయకులు కేతినేని చలపతిరావు, నాయుడు శ్రీనివాసరావు, శీలం కోటారెడ్డి, మువ్వా మురళీధర్‌రావు, కొండపల్లి చంద్రశేఖర్, ఎముకపాటి దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగారం కళాశాలలో
'టెట్'కు సాంకేతిక సమస్య

ఆలస్యంగా లోనికి అనుమతించిన యాజమాన్యం


సాయిస్ఫూర్తి కళాశాల గేటు ముందు అభ్యర్థులు

సత్తుపల్లిరూరల్, మే 20: సోమవారం సత్తుపల్లి మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి కళాశాలలో నిర్వహించిన టెట్ పరీక్షకు యాజమాన్యం తమను ఆలస్యంగా అనుమతించినట్టు అభ్యర్థులు వాపోయారు. సుదూర ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రానికి వ్యయప్రయాసలకు ఓర్చి చేరుకున్న తమను కనీసం కళాశాల లోనికి సైతం అనుమతించకుండా గేట్ బయటనే ఉంచారని, కనీసం తాగు నీటి సౌకర్యం లేక ఎండలోనే మగ్గిపోయామంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష జరగాల్సి ఉండగా 7.30కే పరీక్ష కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులను ఆలస్యంగా కళాశాలలోకి అనుమతించారని చెప్పారు. ఇదే విషయమై టెట్ పరీక్ష ఇన్‌చార్జి యాకూబ్‌ను వివరణ కోరగా సాంకేతిక సమస్య కారణంగా 10 నిమిషాలు మాత్రమే ఆలస్యమైందని, మధ్యాహ్నం తరువాత యథావిధిగా కొనసాగిందని చెప్పారు. మొత్తం కేంద్రానికి 500 మంది అభ్యర్థులను కేటాయించగా.. ఉదయం పరీక్షకు 220, మధ్యాహ్నం 190 మంది హాజరయ్యారు. కాగా కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 500మందికి గానూ ఉదయం 360, మధ్యాహ్నం 265మంది అభ్యర్థులు హాజరయ్యారు.

గ్రామీణ వైద్యులకు
అండగా ఉండాలి

సీపీఎం జిల్లా కార్యదర్శిని కోరిన ఆర్ఎంపీలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 20: దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులకు సీపీఎం అండగా నిలవాలని గ్రామీణ వైద్యుల సమాఖ్య నాయకులు కోరారు. సోమవారం ఖమ్మంలో సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావును జేఏసీ నాయకులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఇటీవల కాలంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్, టీఎస్ఎంసీ గ్రామీణ వైద్యులపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. 428జీవోను మార్పులు చేసేందుకు తాము చేస్తున్న ఉద్యమానికి తోడుగా రావాలని కోరారు. నాయకులు కొంగర గోపి, ఎస్వీ రామారావు, షేక్ నాగుల్‌మీరా, గోపాల్, పుల్లారెడ్డి, రహీం, రబ్బానీ, ఖదీర్, ఖాసీం, పాషా పాల్గొన్నారు.

దోపిడీ ప్రభుత్వాలను ఓడించాలి

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.కృష్ణారెడ్డి

వైరా, మే 20: దోపిడీ ప్రభుత్వాలను ఓడించటానికి కార్మికవర్గ నాయకత్వంలో ప్రజలు పోరాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైరాలో రెండోరోజు సోమవారం జరిగిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మంజిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో భారతదేశ చరిత్ర గురించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించి కార్పొరేట్ వర్గాలకు పెద్దపీట వేస్తుందని విమర్శించారు. ఇంకా పలు అంశాల గురించి ఆయన వివరించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఏ.వెంకరెడ్డి, కె.అర్జున్‌రావు, సీవై.పుల్లయ్య, ఝాన్సీ, ఆవుల అశోక్, వెంకటేశ్వర్లు, జి.రామయ్య, గుర్రం అచ్చయ్య, శివలింగం, బండెల వెంకయ్య, కోమటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, యలదండి బాబు, పాశం అప్పారావు పాల్గొన్నారు.

తాతా మధు తీరుతోనే
వైరా బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమి

పార్టీ వ్యతిరేకులను సస్పెండ్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే అనుచరుల ఆరోపణ


మాట్లాడుతున్న మండల నాయకులు

కారేపల్లి మే 20: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తాతా మధు కాంగ్రెస్‌పార్టీకి కోవర్టుగా ఉండటంవల్లే వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి పోటీచేసిన బానోత్ మదన్‌లాల్ ఓటమి పాలయ్యారని ఆయన వర్గీయులు ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైరా నియోజకవర్గానికి ఆయన సూచించిన అభ్యర్థికి కేసీఆర్ టికెట్ ఇవ్వలేదని, అందుకే ఆయన మండల, గ్రామకమిటీలకు ఫోన్లుచేసి మదన్‌లాల్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేయాలని సమాచారం ఇచ్చారని, పార్లమెంట్ ఎన్నికల్లో మండలానికి రావాల్సిన డబ్బులను రాకుండా తాతా మధు అడ్డుకున్నారన్నారు. బూత్ కమిటీ డబ్బులను మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ అనుచరులుగా ఉన్న ఎంపీపీ శకుంతల, మాజీ సర్పంచ్‌లు కిశోర్, బానోత్ కుమార్‌లకు అందజేశారన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న నాయకులను తక్షణమే సస్పెండ్ చేయాలని మాజీ సర్పంచ్ సక్రు, లకావత్ లక్ష్మణ్, మూతి కోటేశ్వరరావు, గుగులోత్ జూంకీలాల్, కోటేశ్వరరావు, వికాష్, మధు పాల్గొన్నారు.

ధరణిలో భూసమస్యలను పరిష్కరిస్తాం

కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్

కల్లూరు, మే 20: ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను ఈనెల చివరిలోగా పరిష్కారించటానికి ప్రాధాన్యతనిస్తున్నట్టు కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కల్లూరు డివిజన్ పరిధిలో సుమారు 2వేల వరకు ధరణి పోర్టల్ (ఆన్‌లైన్ దరఖాస్తులు)లో పలు రకాల భూసమస్యల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. పెండింగ్‌లో ఉన్న వాటిలో పరిష్కారం దిశగా మండల స్థాయిలో తహసీల్దార్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, జిల్లా స్థాయిలో కలెక్టర్ వాటిని పరిష్కరించేందుకు కసరత్తు జరుగుతుందన్నారు. ఇలా ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో ఏ అధికారిస్థాయిలో పరిష్కార మార్గం లభిస్తుందో ఆయా దరఖాస్తులను విభజించటం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇలా ఆరు రకాలుగా నెలకొన్న భూసమస్యలను పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఇప్పటికే మండల స్థాయిలో తహసీల్దార్లు ఇదే కసరత్తులో నిమగ్నమయ్యారని వివరించారు. సర్వే నెంబర్లు మిస్సింగ్‌లు, రైతుకు ఉన్న భూమికంటే సర్వే నెంబర్లలో విస్తీర్ణం తక్కువగా చూపించటం, ఎన్ఆర్ఐల వంటి తదితర భూసమస్యలను పాస్‌బుక్‌లలో సవరణ చేయటం జరుగుతుందని అన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కల్లూరు డివిజన్‌లో మొత్తం 17,218 గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వారికి గాను ఓటు హక్కు వినియోగించుకునేందుకు 22 పోలింగ్ కేంద్రాను ఏర్పాటు చేయటం జరుగుతుందని అన్నారు. బీఎల్‌వోలు ఇప్పటికే పోలింగ్ స్లిప్‌లను పంపిణీ చేయటం జరిగిందని ఆర్డీవో తెలిపారు.

ఘనంగా సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు


ముగింపు వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ రవిమారుత్

ఖమ్మంఖానాపురం హవేలి, మే20: నగరంలోని స్ప్రింగ్‌లీఫ్, టెండర్ రూట్స్ పాఠశాలల సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలకు హార్వెస్ట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.నాగమణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమ్మర్ క్యాంపు చిన్నారులకు మంచి ఉపయోగాలను సమకూరుస్తుందన్నారు. ఈ వేసవిలో పిల్లలు ఎండ బారినపడి అనారోగ్యం తెచ్చుకోకుండా ఇటువంటి క్యాంపులు ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డిలు మాట్లాడుతూ చిన్నారుల్లో కళానైపుణ్యం పెంపొందించేందుకు ఆర్ట్స్, క్రాఫ్ట్ శిక్షణ సాధన కోసం నృత్య సాధన, మేధాశక్తి, వ్యూహాత్మక శక్తి పెంపొందించడానికి చదరంగం, చిత్రలేఖనంతదితర క్రీడలకు సంబంధించిన పలు విషయాలను చిన్నారులకు నేర్పించామన్నారు. ఏప్రిల్ 25 నుంచి మే 20 వరుక ఈ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఈశిక్షణ శిబిరంలో 200మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మసకబారిన మత్స్య ప్రభ

▸ నామమాత్రంగా మారిన వైరా మత్స్య విత్తనోత్పత్తి కేంద్రం

వైరా, మే 20: వైరాలోని మత్స్య విత్తనాభివృద్ధి అధికారి(ఎఫ్‌డీవో) పరిధిలో పది మండలాలున్నాయి. దాదాపు 60 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, మూడు రిజర్వాయర్లు, 395 చెరువులు, కుంటలున్నాయి. వేలాది మంది మత్స్యకారులు ఈ సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. గతంలో ఎఫ్‌డీవో పరిధిలో 12మండలాలు ఉండగా, జిల్లాల పునర్విభజన సమయంలో అశ్వారావుపేట, దమ్మపేట మండలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఇక ఆతర్వాత సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, వైరా, కొణిజర్ల, ఎర్రుపాలెం, మధిర మండలాలు ఈ అధికారి పరిధిలో మిగిలిపోయాయి.

ఉమ్మడి ఏపీలో ఎంతో ప్రసిద్ధి....

ఉమ్మడి ఏపీలో వైరాలోని మత్స్య విత్తనోత్పత్తి కేంద్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా ఇక్కడ బొచ్చా, బంగారుతీగె, రోహు, మృగాల వంటి చేపపిల్లలను ఉత్పత్తి చేసి పైన పేర్కొన్న పదిమండలాల్లోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలే కాకుండా ఖమ్మంజిల్లాలోని ఇతర ప్రాంతాలతోపాటు వరంగల్ తదితర ప్రాంతాలకు కూడా చేపపిల్లలను సరఫరా చేశారు. సీజన్‌కు ముందు ఆడ, మగ చేపలను సేకరించి వాటికి మొదట ఓయూపీ ప్రైమ్ ఆతర్వాత ఓవీపీ బ్రిడ్ హార్మోన్ ఇంజిక్షన్లు చేసి ఆడ, మగ చేపలను సంక్రమింపజేసి స్పాన్ రాబట్టి తద్వారా చేపపిల్లలను అభివృద్ధి చేసి మత్స్యకారులకు సరఫరా చేసేవారు. అప్పట్లో వైరా విత్తనోత్పత్తి కేంద్రానికి ఎంతో డిమాండ్ ఉండేది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రమేణా దీని ప్రాధాన్యత తగ్గిపోయింది. ఒక్కోసారి వర్షాలు సరిగా లేక, ప్రకృతి అనుకూలించక కూడా చేపపిల్లల ఉత్పత్తి చేయడం లేదు.

శిథిలావస్థకు నర్సరీలు...

ఈ విత్తనోత్పత్తి కేంద్రంలో 38సిమెంట్ నర్సరీలు ఉన్నప్పటికీ వాటిలో సగం శిథిలావస్థకు చేరుకున్నాయి. నాలుగు మట్టి నర్సరీలు ఉం డగా అవి అధ్వానంగా ఉన్నాయి. చేపపిల్లలను అధునాతన సాంకేతిక పద్ధతుల్లో ఉత్పత్తి చేసేందుకుగాను 35ఏళ్ల కిందట మొదట ఎకో ఆర్సరీలను ఏర్పాటు చేశా రు. చేపపిల్లల ఉత్పత్తి లేక అవి కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయి.

పూర్తిస్థాయి అధికారి లేక ఐదేళ్లు...

ఈ విత్తనోత్పత్తి కేంద్రంలో పూర్తిస్థాయి అధికారి పోస్టు ఐదేళ్ల నుంచి ఖాళీగా ఉంది. ఇక్కడ పూర్తిస్థాయి ఎఫ్‌డీవో అయిన జి.శివప్రసాద్‌ను సిరిసిల్ల డీఎఫ్‌వోగా



డిప్యూటేషన్‌పై అప్పటి ప్రభుత్వం పంపించింది. ఆయన ఇప్పటికీ వైరా నుంచే వేతనం తీసుకుంటున్నప్పటికీ సిరిసిల్ల జిల్లా మత్స్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో ఇద్దరు డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. అర్హత లేని ఒక జూనియర్ అసిస్టెంట్‌ను ఇక్కడకు పంపించిన కొద్దికాలానికే తిరిగి యథాస్థానానికి పంపించివేశారు. ఆ తర్వాత ఇన్‌చార్జ్ ఎఫ్‌డీవోగా వచ్చిన అధికారి అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇక అప్పటి నుంచి ఇక్కడ ఎఫ్‌డీవో పోస్టు ఖాళీగానే ఉంది. ఖమ్మం ఏడీఎఫ్ ఆంజనేయస్వామే ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి నిధులు కేటాయించి జవసత్వాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులుకోరుతున్నారు.

పోటా పోటీగా



పట్టభద్రుల ప్రచారం

▸ ప్రతిష్ట కోసం పార్టీల ఆరాటం

ఖమ్మం, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రధాన రాజకీయ పార్టీలకు మరో పరీక్ష కాబోతుంది. గుర్తు లేకపోయినా పార్టీ తరుపున అభ్యర్థి బరిలో ఉండడంతో పట్టభద్రుల ఉప ఎన్నిక కాస్త పార్టీలకు ప్రతిష్టగా మారింది. దీంతో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తరహాలో ప్రచారాలు సాగిస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు కూడా కాంగ్రెస్‌ను ఢీకొనేందుకు ఈ ఎన్నికల్లో ఎవరికి వారు వ్యూహరచన సాగిస్తున్నారు.

ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీలు అభ్యర్థులు ముగ్గురిలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి మొదటిసారి ఎన్నికల బరిలో ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఇద్దరు పాత ప్రత్యర్థులే. గత అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్న బీఆర్ఎస్, బీజేపీలు శాసనమండలి ఎన్నికల్లోసత్తా చూపి తమ ఉనికి చాటుకునేందుకు ఈఎన్నికలను కూడా సవాల్‌గా తీసుకున్నాయి.

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయం కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీమంత్రి కేటీఆర్ జిల్లాలో ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలో ఎన్నికలప్రచార సభలు నిర్వహించారు. బీఆర్ఎస్ పక్షాన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాత మధుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఆర్‌జేసీ విద్యాసంస్థల అధిపతి కృష్ణ తదితరులు ప్రచారం సాగిస్తున్నారు. అభ్యర్థి రాకేష్‌రెడ్డి కూడా విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఇప్పటికే నల్గొండ, వరంగల్‌లో ప్రచారం సాగించి జిల్లాలో ప్రచారం నిర్వహించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలను కలిసి ఓటువేయాలని కోరా రు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కలిశారు. పది నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను కూడా నియమించా రు. కాంగ్రెస్ పార్టీకూడా ప్రచారం వేగవంతం చేసింది.

ఇక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి జిల్లాలో ఇటీవల రెండురోజుల పాటుప్రచారం నిర్వహించారు. ప్రేమేందర్‌రెడ్డి తరుపున మాజీమంత్రి ఈటల రాజేందర్ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే ధర్మారావు ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్‌మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు కూడా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు.

మూడు ప్రధాన పార్టీలు శాసనమండలి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకని ఢీ అంటే ఢీ అన్నట్టుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో పట్టభద్రులు మాత్రమే ఓటువేసేఅవకాశం ఉన్నందున కేవలం అధికార కాంగ్రెస్ కాకుండా విపక్ష పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్‌లు కూడా గట్టిగానే కసరత్తు చేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తే పట్టు నిలుపుకునే అవకాశం ఉంటుందన్న ఆశతో బీజేపీ, బీఆర్ఎస్‌లున్నాయి. మూడు ఉమ్మడి జిల్లాల్లో 4,63,839 మంది ఓటర్లు ఉండగా ఖమ్మం జిల్లాలో 83,879, భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లాలో 40106 మంది ఓటర్లున్నారు. నల్గొండ, వరంగల్ ప్రధాన అభ్యర్థులకు పోటాపోటీగా పోలింగ్ జరిగినా అభ్యర్థి గెలుపులో ఉమ్మడి ఖమ్మం జిల్లాదే కీలకం కాబోతుంది. గతంలో జరిగిన రెండు ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వరరెడ్డి గెలుపులో ఉమ్మడి ఖమ్మంజిల్లా కీలకమైంది. దీంతో మూడు పార్టీల నేతలు ఉమ్మడి ఖమ్మం జిల్లాపై గురిపెట్టి ప్రచారం సాగిస్తున్నారు.

క్రైం సమాచారం

లారీ, బైక్ ఢీ..వ్యక్తి మృతి

దమ్మపేట, మే 20: లారీని ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన సంఘటన గట్టుగూడెం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల సత్యనారాయణ (48) ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈఘటనలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాము ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గుండెపోటుతో యువకుడు..



నాగార్జున(ఫైల్)

చింతకాని, మే 20: మండల పరిధిలోని నాగులవంచ రైల్వేకాలనీ గ్రామానికి చెందిన కోపూరి నాగార్జున్ (30) అనే యువకుడు గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. మృతుడు సోమవారం మధ్యాహ్నం సరదాగా స్నేహితులతో క్రికెట్ ఆడుతుండగా చాతిలో నొప్పి రావడంతో ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పాల్వంచలో ఇరిగేషన్ సూపరింటెండెంట్...

పాల్వంచ, మే 20: గుండుపోటుతో ఇరిగేషన్ సూపరింటెండెంట్ మృతి చెందిన సంఘటనపై పాల్వంచ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ బాపూజీనగర్‌లో నివాసముంటున్న నంద్రు క్రాంతి(42) కొత్తగూడెం ఇరిగేషన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. తన కుమారుడు రఘురాంతో కలిసి ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటుంది. కాగా ఆదివారం రాత్రి రఘురాం తన మిత్రుడితో కలిసి తన ఇంట్లోని వేరే బెడ్‌రూంలో నిద్రించాడు. అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో తన తల్లి గదిలోని అలారం మోగగా అతడు వెళ్లి చూసేసరికి ఆమె అచేతనంగా ఉండడంతో పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు ఆమె గుండెపోటుతో మృతి చెందిందని నిర్ధారించారు. మృతురాలి కుమారుడు రఘురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ బానాల రాము తెలిపారు.

పిడుగుపాటుకు 12 పశువులు..



మృతి చెందిన పశువులు

పాల్వంచ, మే 20: పిడుగుపాటుకు పది పశువులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పాల్వంచ మండలం రేగులగూడెం పరిసరాల్లో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో రాళ్ళచెలక గ్రామ శివారులోని ఓ చెట్టుపై పిడుగుపడి చెట్టు కింద తల దాచుకున్న పది పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామానికి చెందిన పద్దం లక్క, మడకం జోగా, మడివి లక్కులకు చెందిన పశువులుగా స్థానికులు గుర్తించారు.

కల్లూరు: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో ఆదివారం ఉరుములతో కురిసిన వర్షంతో పిడుగుపాటుకు గురై రూ. 1.50 లక్షల విలువ గల దుక్కిటెద్దు, ఆవు మృతి చెందాయి. మండలంలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన వినుకొండ దానియేలు అనే రైతుకు చెందిన రెండు పశువులు మేత కోసం పొలాల్లోకి వెళ్లగా, ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి మృతి చెందాయి.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు..

జూలూరుపాడు, మే20: విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు భూక్య బద్దులాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గాలివానతో గ్రామ సమీపంలో పంటపొలంలో విద్యుత్ తీగ తెగిపడింది. మేత కోసం అటుగా వెళ్లిన దుక్కిటెద్దు ప్రమాదవశాత్తూ విద్యుత్‌తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన దుక్కిటెద్దు విలువ రూ.1.50లక్షలు ఉంటుందని తెలిపాడు. సంఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి బద్దులాల్, విద్యుత్‌శాఖ ఇంజనీరు సతీష్‌లు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వైరాలో రెండు పాడిగేదెలు..

వైరా, మే 20: వైరాలోని ద్వారకానగర్‌కు చెందిన మహిళా రైతు రాచబంటి పద్మకు చెందిన రెండు పాడిగేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. మేత కోసం తన గేదెలను తోలుకెళ్తుండగా వైరా రిజర్వాయర్ కుడికాల్వ ప్రధాన లాకుల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు వద్ద ఎర్త్‌వైర్లు తగిలి కరెంట్‌షాక్‌తో గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని ఆమె తెలిపింది. పోలీసులకు, విద్యుత్‌శాఖ అధికారులకు ఆమె ఫిర్యాదు చేసింది.

బాలుడికి తీవ్రగాయాలు...

అశ్వాపురం, మే 20: విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అమెర్ధా ఎస్సీ కాలనీకి చెందిన ఇరుగు నాగరాజు కుమారుడు విగ్నేష్(7) ఇంటి డాబాపై ఆడుకుంటుండగా, డాబా పైనుంచి వెళ్తున్న 11కేవీ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని వెంటనే చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

అక్రమంగా కలప తరలిస్తున్నట్రాక్టర్ సీజ్



కలపను పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు, మే 20: ఎలాంటి అనుమతులు లేకుండా ఓ రైతు అక్రమంగా అటవీ ప్రాంతం నుంచి కలప తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి సదరు రైతుపై కేసు నమోదు చేశారు. సోమవారం ఎఫ్‌ఆర్వో ప్రసాద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పడమటనర్సాపురం గ్రామానికి చెందిన మాలోత్ కిషన్ అనే రైతు తన పొలంలోని కాకర పాదులకు పందిరి పెట్టేందుకు చీమలపాడు అటవీ ప్రాంతం పరిధిలోని పాపకొల్లు బీట్‌లోని అటవీ ప్రాంతంలో 160 కర్రలు(వాసాలు) అదే గ్రామానికి చెందిన కూలీలను తీసుకువెళ్లి నరికించాడు. నరికిన కలపను ఆదివారం రాత్రి ట్రాక్టర్‌లో గ్రామానికి తరలిస్తుండగా తమ సిబ్బంది దాడులు నిర్వహించి పట్టుకున్నారన్నారు. కలపను స్వాధీనం చేసుకొని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి జూలూరుపాడు రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. పట్టుబడిన కలప విలువ రూ.21,000 లు ఉంటుందని అన్నారు. సదరు రైతుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో మల్లయ్య, ఎఫ్‌బీవోలు కిషన్, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ తెగిపడి గడ్డివాము దగ్ధం

కామేపల్లి, మే 20: విద్యుత్ లైన్ తెగి గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని మద్రిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. మద్రిగూడెం గ్రామానికి చెందిన బత్తుల సుమన్ తనకున్న గేదెల మేత కోసం 1000వరి గడ్డి కట్టలను ఖాళీ స్థలంలో ఉంచాడు. విద్యుత్ తీగలపై కోతులు ఆటాడుతుండగా విద్యుత్‌తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పు రవ్వలు గడ్డివాము మీద పడడంతో గడ్డి వాము దగ్ధమైంది. ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చినప్పటికీ, అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది.

విలువిద్య శిక్షణ కేంద్రానికి ‘రికర్వేబౌ’ అందజేత



కళ్యాణ్‌కు రికర్వే బౌను అందజేస్తున్న కలెక్టర్ ప్రియాంకఅల

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే20: భద్రాద్రి జిల్లాలో ఇటీవల పాల్వంచలో నెలకొల్పిన విలువిద్య శిక్షణ కేంద్రానికి రూ.3.50 లక్షల రికర్వేబౌను విలువిద్య శిక్షకుడు కళ్యాణ్‌కు ఐడీవోసీలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంకఅల సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వ క్రీడ అయిన విలువిద్య నేడు ప్రజాదరణ పొందుతుందని అభినందించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనే క్రీడాకారులకు ఒక క్రమ పద్ధతిలో ప్రణాళిక బద్ధంగా శిక్షణను అందించి వారి ప్రతిభను వెలికితీయాలని కోరారు. ఈ శిక్షణ శిబిరంలో క్రీడాకారులు ఉన్న వనరులను వినియోగించుకొని ప్రతిభ చాటాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విలువిద్య క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో పరందామరెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారుడు లక్ష్మణ్, సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది వరదాచారి మృతి



ఖమ్మం లీగల్, మే 20: ఖమ్మం నగరంలోని బ్రాహ్మణబజారుకు చెందిన సీనియర్ న్యాయవాది ఎంవీ. వరదాచారి(84) సోమవారం రాత్రి మృతి చెందాడు. గతంలో ఖమ్మం జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ఖమ్మం కోర్టు ప్రస్తుతం ఉన్న భవన సముదాయాల సమయంలో 1975లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. వారి భౌతికకాయాన్ని సీనియర్, జూనియర్ న్యాయవాదులు సందర్శించి ఘనంగా నివాళులర్పించాలన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లిసత్యనారాయణ. గోగినేని మాధవరావు, పోట్ల మాధవరావు, కాటమనేని రమేష్, కాళ్ళూరి లక్ష్మినరసింహారావు, ఎం.నిరంజన్‌రెడ్డి, కె.పి.సత్యనారాయణ, వి.కృష్ణమూర్తి, నెల్లిపాక రమేష్, ప్రభుత్వ న్యాయవాదులు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సీనియర్, జూనియర్ న్యాయవాదులు తమ సంతాపం తెలిపారు. ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ళ శ్రీనివాసరావు, కార్యదర్శి చింతనిప్పు వెంకట్ అధ్యక్షతను ఎంవీ. వరదాచారి సంతాప సభ కోసం నేడు సమావేశం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు మేలుగా కేరళ సహకార విధానం

▸ డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు



కేరళ సహకార బ్యాంకులో ఖమ్మంలో డీసీసీబీ పాలక సభ్యులు

ఖమ్మం వ్యవసాయం, మే 20: కేరళ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ విధివిధానాలు రైతులకు ఉపయోగపడే విధంగా ఉన్నాయని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. కేరళ రాష్ట్రంలోని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకుకు అనుబంధంగా పనిచేస్తున్న ప్రాథమిక సహకార సంఘాలను సందర్శించడానికి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పాలకవర్గం ఆ రాష్ట్రానికి విజ్ఞాన యాత్రగా నిర్వహించారు. ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు పర్యటిస్తారు. 19వ తేదీన హైదరాబాద్ నుంచి బయలుదేరి కేరళలోని మున్నారును చేరుకున్నారు. సోమవారం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కేరళ బ్యాంకులకు అనుబంధంగా ఉన్న మున్నారు కోఆపరేటివ్ బ్యాంక్‌ను సందర్శించారు. సదరు బ్యాంకులో అవలంభిస్తున్న పాలసీలు, రుణ పథకములు, స్కీమ్స్, ఇతర సర్వీసుల గురించి సభ్యులు తెలుసుకున్నారు. కేరళ రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న రెండంచెల విధానం (రాష్ట్ర అపెక్స్ బ్యాంక్, ప్రాథమిక సహకార సంఘాల) గురించి తె లుసుకొన్నారు. ఈ షెడ్యూల్ మే 22 వరకు ఉంటుందని తిరిగి 23న హైదరాబాద్ చేరుకుంటారని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ యాత్రలో పాలకవర్గ సభ్యులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, కృష్ణయ్య, చావా వేణు, మేకల మల్లిబాబు యాదవ్, నిర్మల పుల్లారావు, బోబోలు లక్ష్మణరావు, జనగం కోటేశ్వరరావు, పేరబత్తిని ప్రసాద్, నూకల సైదులు, కోరం జానకిరావు, మోదుగు పుల్లారావు పాల్గొన్నారు. ఈ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్‌గా డీజీఎం కిరణ్, ఏజీఎం కృష్ణ మోహన్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.లక్ష నగదు స్వాధీనం

ఖమ్మం క్రైం, మే 20: పేకాట ఆడుతున్న పలువురిని సోమవారం ఖమ్మం టు టౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని మామిళ్లగూడెంలోని ఓ ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, టూ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలువురు పేకాట ఆడుతుండగా, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

టికెట్ మిషన్ పనిచేయడం లేదని.. బస్‌లో పురుషులను ఎక్కించుకోని కండక్టర్



కండక్టర్ బస్సు ఎక్కనివ్వకపోవడంతో బస్టాప్‌లో నిల్చున్న ప్రయాణికులు

కరకగూడెం, మే 20: టికెట్ మిషన్ పనిచేయడంలేదని ఓ కండక్టర్ బస్సులో పురుషులు బస్సెక్కేందుకు నిరాకరించాడు. ఉచిత ప్రయాణ సదుపాయం ఉండడంతో మహిళలను మాత్రమే బస్సులో ఎక్కించుకొని వెళ్లాడు. కరకగూడెంలో సోమవారం జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మణుగూరు డిపో నుంచి కరకగూడెం, రంగాపురం, గుండాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో గుండాలనుంచి మణుగూరు వెళుతున్న ఓ పల్లెవెలుగు బస్సులో టికెట్ ఇచ్చే మిషన్ పనిచేయడం లేదని కండక్టర్ కరకగూడెం తదితర ప్రాంతాల్లో పురుషులు బస్ ఎక్కేందుకు నిరాకరించాడు. భార్యభర్తలు ఉంటే భార్యను బస్సులో ఎక్కించుకొని భర్తను మాత్రం అనుమతించలేదు. దాంతో సాధారణ ప్రయాణికులతో పాటు పరీక్షలకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చేసేదేమీలేక అత్యవసరం ఉన్న ప్రయాణికులు ఆటోల్లో వెళ్లారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో సదరు కండక్టర్ మహిళలను మాత్రమే బస్సులో ఎక్కించుకొని మణుగూరు వెళ్లిపోయాడు.

ఈ విషయంపై మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామిని ‘ఆంధ్రజ్యోతి’ వివరణ కోరగా ఏజేన్సీ ప్రాంతాల్లో తిరిగే బస్సులకు కొత్త మిషిన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. టిమ్‌టికెట్ మిషన్ పనిచేయకపోతే కండక్టర్ ఉన్నత అధికారులకు తెలియజేసి పేపర్‌పై టికెట్ ఇచ్చి ప్రయాణికులను తరలించాలన్నారు. కరకగూడెంలో జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆస్తి కోసం కన్నతల్లి, కుమార్తెలను చంపిన హంతకుడి అరెస్ట్

తల్లాడ, మే20: ఆస్తికోసం కన్నతల్లి, కుమార్తెలను చంపిన హంతకుడితో పాటు అతడిని ప్రేరేపించిన భార్యను పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎన్. సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం గోపాలపేట గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి మొదటి భార్య కనకదుర్గ రెండేళ్ల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ క్రమంలో తల్లాడకు చెందిన గూడె త్రివేణీతో రెండున్నర ఏళ్లుగా సహజీవనం చేస్తూ రెండో వివాహం చేసుకున్నాడు. కాగా వీరు గత నవంబర్ వరకు తల్లాడలో నివాసం ఉన్నారు. 6నెలల క్రితం ఖమ్మంలోని కరుణగిరి ప్రాంతానికి వెళ్లి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. త్రివేణి తరచూ గొడవపడుతూ వెంకటేశ్వర్లును ఏదోవిధంగా గోపాలపేటలో అతడి తల్లి పిచ్చమ్మ, కుమార్తెలు నీరజ, ఝాన్సీ మోహినీల పేరున ఉన్న ఎకరం పొలం, ఇల్లు, ఇతర స్థలాలను అమ్ముకుని రావాలంటూ ఒత్తిడి చేసింది. దీంతో గత డిసెంబర్ నెలలో తల్లి పిచ్చమ్మను అతడు బెదిరించి ఇల్లు, స్థలాన్ని తన పేరుతో రాయించుకున్నాడు. పిచ్చమ్మ గ్రామ పెద్దలతో విషయం చెప్పడంతో వారు జోక్యం చేసుకుని రాయించిన అగ్రిమెంట్‌ను తిరిగి ఆమెకు ఇచ్చారు. దీంతో అతడు ఈర్ష్య పెంచుకుని తల్లీ, తన ఇద్దరు కుమార్తెలను త్రివేణి ఒత్తిడి మేరకు హతమార్చాలని నిశ్చయించుకున్నాడు. ఈ మేరకు ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి ఖమ్మం నుంచి తన ఇంటికి వెళ్లి నిద్రలో ఉన్న తల్లి పిచ్చమ్మ మొఖంపై దిండు వేసి గొంతు నులిమి చంపాడు. పిచ్చమ్మతో పాటు కుమార్తెలు నీరజ, ఝాన్సీ మోహినీలను కూడా అదే విధంగా చంపాడు. ముగ్గురిని చంపిన తర్వాత నడుచుకుంటూ లక్ష్మీనగర్ వరకు వచ్చి బస్సు ఎక్కి ఖమ్మం వెళ్లాడు. ముగ్గురిని వెంకటేశ్వర్లు హత్య చేసి ఉంటాడని భావించిన పోలీసులు దర్యాప్తు అనంతరం ఆదివారం సాయంత్రం తల్లాడ బస్టాండ్‌లో సత్తుపల్లి వెళుతుండగా అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. భర్తను ప్రేరేపించిన భార్య త్రివేణిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపాడు, మే 20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా 3,5,8వ తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి(61)సీట్లు, 5వ తరగతి(30)సీట్లు, 8వ తరగతికి(30) సీట్లుతో కలిపి 121సీట్లు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను జూన్ 6వ తేదీ లోపు ఐటీడీఏ భద్రాచలం కార్యలయం నందు అందజేయాలని అన్నారు. ప్రవేశ ఎంపికను జూన్ 12న నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రూ.200కోసం.. అన్నపై తమ్ముడి దాడి

పాల్వంచ, మే 20: రూ.200 కోసం సొంత అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం కాలనీకి చెందిన నరుకుడు దుర్గాప్రసాద్ తన తమ్ముడు పెద్దిరాజుకు రూ.200 రూపాయలు బాకీ పడ్డాడు. మద్యం సేవించిన పెద్దిరాజు తన అన్నను డబ్బులు ఇవ్వమని అడగ్గా, దుర్గాప్రసాద్ ప్రస్తుతం తన వద్ద లేవని తరువాత ఇస్తానని చెప్పాడు. కానీ మద్యం మత్తులో ఉన్న పెద్దిరాజు కర్ర తో అన్నపై దాడి చేయగా దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స తీసుకున్న అనంతరం దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

మద్యం మత్తులో బావిలో దూకిన యువకుడు

● రక్షించిన గ్రామస్థులు

నేలకొండపల్లి, మే20: మద్యం మత్తులో బావిలో దూకి, బయటకు రాలేక ఇబ్బంది పడుతున్న యువకుడిని గమనించిన గ్రామస్థులు ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీసిన సంఘటన సోమవారం మంగాపురంతండాలో జరిగింది. వివరాల ప్రకారం.. ఇస్లావత్ రంజిత్ అనే యువకుడు మద్యం మత్తులో తండాలోని ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న బావిలో దూకాడు. మద్యం మత్తు దిగాక బయటకు రాలేక కేకలు వేస్తుండగా, గమనించిన తండావాసులు బయటకు తీయటానికి ఎంతగానో శ్రమించారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో అతడిని బయటకు తీశారు..

రఘునాథపాలెం అంగన్వాడీ కేంద్రంలో చోరీ

రఘునాథపాలెం, మే 20: అంగన్వాడీ కేంద్రంలో వరసగా నాల్గో సారి చోరీ జరిగిన సంఘటన రఘునాథపాలెంలో చోటు చేసుకొంది. అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. రేగులచెలక గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కేంద్రంలోని గ్యాస్ సిలిండర్‌తో పాటుగా 14 ఆయిల్ ప్యాకెట్లు, మసాల దినుసులు ప్యాకెట్లును చోరీ చేశారు. సోమవారం ఉదయం అంగన్వాడీ కేంద్రానికి వెళ్లిన సిబ్బందికి తాళాలు పగలికొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించగా, చోరీ విషయం తెలిసింది. కాగా ఇదే అంగన్వాడీ కేంద్రంలో గత ఆరు నెలల కాలంలోనే నాల్గో సారి చోరీ జరగడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు చోరీ జరిగినా గ్యాస్ సిలిండర్లు, ఆయిల్ ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాల తయారీ దొంగలు తస్కరిస్తున్నారు. సీడీపీవో, సూపర్‌వైజర్ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.


కొత్తగూడెంలో ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం, మే 20(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు దళ సభ్యులు సోమవారం భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ సమక్షంలో లొంగిపోయి. ఏటూరునాగారం మాదేవపూర్ ఏరియా దళ సభ్యుడు కోవాసి గంగా అలియాస్ మహేష్, అలియాస్ జనార్ధన్, సోడి ఉంగి అలియాస్ జాన్సీ కలును ముద్రలు మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నారు. వీరంతా మావోయిస్టు పార్టీ విధానాలకు నచ్చక భద్రాద్రి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వరంగా వచ్చే సదుపాయాలను అందిస్తామని ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. అనంతరం లొంగిపోయిన మవోయిస్టులకు ఎస్పీ సహాయాన్ని అందించారు.



ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దళసభ్యులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
6
మంగళవారం 21 మే 2024



వర్షాకాలం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి



» మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్, మే20: రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నగరమేయర్ పునుకొల్లు నీరజ అధికారులకు సూచించారు. నగరంలోని నివాస ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను యజమానులు వారి సొంతఖర్చుతో శుభ్రం చేయించాలని, లేకుంటే నగరపాలకసంస్థ చర్యలు తీసుకుంటుందన్నారు. నాలాలలో పేరుకుపోయిన చెత్త, సిల్టులను తొలగించాలని, అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణాలను పూర్తిచేయాలని మేయర్ కోరారు. పారిశుధ్య కార్మికుల పనితీరును జవాన్లు పర్యవేక్షణ చేయాలన్నారు. సాయంత్రం 5గంటలనుంచి డివిజన్లలో ఫాగింగ్ చేయాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ కోరారు.

బీఆర్క్ ఫలితాల్లో 'న్యూలిటిల్ ఫ్లవర్' హవా



స్వాక్యా, విక్రాంత, సాయిసుధీర్, శ్రీముఖి

వైరా, మే 20: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన బీఆర్క్ ప్లానింగ్ ఫలితాల్లో వైరా న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనపర్చారు. కుర్రా స్వాక్యా 1247వ ర్యాంకు, నంది గామ విక్రాంత 3350వ ర్యాంకు, చావా సాయిసుధీర్ 4095వ ర్యాంకు, వడ్డే శ్రీముఖి 10862వ ర్యాంకు సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్లు కుర్రా సుమన్, డాక్ర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు అభినందించారు.

పాలిటెక్నిక్ పరీక్ష ఫలితాల్లో 'మదర్‌థెరిస్సా' విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, మే20: 2023-24విద్యా సంవత్సరానికిగానూ పాలిటెక్నిక్ ఆఖరి పరీక్షలను ఎస్‌బీటీఈటీ గత ఏప్రిల్ నెలలో నిర్వహించారు. ఈనెల 11వ తేదీన విడుదల కాగా మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హరికృష్ణ సోమవారం తెలిపారు. 2వ సెమిస్టర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో ఈఈఈ బ్రాంచ్‌లో ఐ.ఉదయ్‌గణేష్, సీఎస్సీ నుంచి కే.సాయిరామలక్ష్మి ప్రత్యూష, ఎం.హర్షితా, బీ.రామవిద్య, షేక్ యాసిన్, షేక్.జరీనా, 4వ సెమిస్టర్‌లో సీఎస్సీ బ్రాంచ్‌లో పి.రజని, ఎం.సాయివెంకటలక్ష్మి, శ్రీప్రత్యూష, పి.గణేష్, ఎన్.హర్షిత, మైనింగ్‌లో షేక్.సోయబ్ అస్లామ్, సీవిల్‌లో ఎస్.సూర్యప్రకాష్, కే.కావేరీ, ఈసీఈలో జే.స్పందన, ఎం.హిమరత్నం, ఆర్.దివ్య, పి.అరుణ్, ఈఈఈ విభాగంలో పి.అరవింద్, 5వ సెమిస్టర్‌లో మైనింగ్‌లో ఎన్.వినయ్‌బాబు, ఎం.దీక్షిత్, కే.కల్యాణ్, సివిల్ పి.సాయిప్రదీప్, జి.నాగభవానీ, ఎం.కౌశిక్, 6వ సెమిస్టర్‌లో ఈసీఈలో కె.నందిని, పి.సత్యలత, సీహెచ్.రాము, ఈఈఈలో షేక్.అస్లామ్ పాషా, ఎస్.శ్రీకర్, పీ.భరత్‌కుమార్, మెకానికల్‌లో ఎం.జాన్‌బాబు, కే.భరద్వాజా, ఎండీ సాధిక్‌పాషా ఉన్నారు. విద్యార్థులను సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డిప్లొమా డీన్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ఆయా విభాగాల అధిపతులును అభినందనలు తెలిపారు.

ప్రమాద బీమా రూ.10 లక్షల చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న దృశ్యం

కల్లూరు, మే 20: ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి కల్లూరులోని తపాల కార్యాలయంలో సోమవారం డివిజన్ తపాల ఇన్‌స్పెక్టర్ కె ప్రవీణ్‌కుమార్ రూ.10 లక్షల బీమా నగదు చెక్కును అందజేశారు. కల్లూరులోని శాంతినగర్‌కు చెందిన కాకాటి ధనమ్మ తపాల కార్యాలయం ద్వారా రూ.399 టాటా పాలసీ తీసుకుంది. ఇటీవల కాలంలో ధనమ్మ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో బీమా సంస్థ నుంచి వచ్చిన రూ.10లక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కినేని రఘు, ఎస్‌పిఎం రామకృష్ణ, రాజా, రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలినడకన తిరుపతికి..

» భట్టికి మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ నాయకుల మొక్కు
» డిప్యూటీ సీఎం కావడంతో పాదయాత్ర



జమలాపురం నుంచి తిరుపతి బయలుదేరిన నాయకులు

ఎర్రుపాలెం, మే 20: జమలాపురం నుంచి మండల కాంగ్రెస్ నాయకులు కాలినడకన తిరుమల తిరుపతికి సోమవారం బయలుదేరారు. జమలాపురం శ్రీవారిని దర్శించుకొని కాలినడక ప్రారంభించారు. సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించి మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్కకు మంత్రి పదవి రావలని, తిరుమల శ్రీవారిని కాలినడకన దర్శించుకుంటామని మొక్కుకున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. డిప్యూటీ సీఎం కావడంతో మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ ఉపాధ్యక్షుడు శీలం శ్రీనివాసరెడ్డి, బండారు నరసింహారావు, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తల్లపురెడ్డి నాగిరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీబాష, బీసీ సెల్ అధ్యక్షుడు కె.పాండురంగారావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్‌లు గూడేటి బాబురావు, కంచర్ల వెంకట నర్సయ్య, పిల్లి బోసు, మండల నాయకులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ఇస్మాయిల్, ఎస్ రాజా, రామదండు, ముక్కర సందీప్‌రెడ్డి, షేక్ బాజీ, బి.శ్రీనివాసరావు, రావూరి రాంబాబు, మన్నె స్వామి, ఫారూక్, ఖుర్షీద్, ఎం.జమలయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న గ్రామీణ వైద్యులు

రూ. 10వేల ఆర్థిక సహాయం

కామేపల్లి, మే 20: పింజరమడుగు గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు రచ్చ అప్పారావు తల్లి రచ్చ నాగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. సోమవారం ఆమె దశదిన కర్మకు గ్రామీణ వైద్యుల సహాయక సంఘం ఆయనకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు మహబూబ్‌రెడ్డి, లక్ష్మణాచారి, గుగ్గిళ్ల రమేష్, దారా సుందర్‌రావు, అమృతరావు, రాధక్రిష్ణ, రాము, ఇమామ్, ఫక్రుద్దీన్, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూడిన కాల్వల జాబితా ఇవ్వండి

» నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి



ఖమ్మం కార్పొరేషన్,మే20: వర్షాకాలం వస్తున్నందున, మురుగుతో పూడుకుపోయిన కాలువల జాబితాలను డివిజన్ల వారీగా అందజేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌తో నిర్వహించిన సమీక్షాసమావేశంలో కమిషనర్ మాట్లాడారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు వారికి కేటాయించిన డివిజన్లలో పర్యటించి, ఎక్కడ మురుగునీరు ఆగుతున్నదో,ఎక్కడ చెత్త పేరుకుపోయిందో నివేదికను తయారు చేయాలన్నారు. గ్యాంగ్‌వర్క్ ద్వారా పనిచేయించే ప్రదేశాలు, మిషనరీతో శుభ్రం చేసే ప్రదేశాలు గుర్తించి, అందుకు అనుగుణంగా మురుగుకాలువలను శుభ్రం చేయించాలన్నారు. ప్రధాన డ్రెయినేజీ కాలువలన్నింటినీ గ్యాంగ్‌వర్క్ ద్వారా శుభ్రం చేయించాలన్నారు. కాలువల్లో చెత్త వేసే వారికి, రహదారి పక్కన కొబ్బరిబొండలు పడవేసేవారికి భారీగా జరిమానాలు విధించాలని కమిషనర్ ఆదేశించారు. తాను స్వయంగా పర్యటించి పరిశీలిస్తానని కమిషనర్ పేర్కొన్నారు. ఖాళీ ప్లాట్లలో చెత్తపేరుకుపోతే ఆయా ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. లార్వాలు వృద్ధిచెందకుండా గంబూజా చేపపిల్లలను, ఆయిల్‌బాల్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

23న దేవాలయ దుకాణాలకు వేలం

ఖమ్మంసాంస్కృతికం, ఏప్రిల్ 20: వైరారోడ్‌లోని జలాంజనేయస్వామి దేవాలయంలో పలు దుకాణాల నిర్వహణకు వేలం ప్రక్రియ ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయంలో నిర్వహిచనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయం, పూల దుకాణం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు వేలం నిర్వహిస్తామన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

స్తంభాద్రి (గుట్ట)లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం ఘనంగా అంకురార్పణ జరిగింది. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజున స్వామి వారికి పలు పూజలు నిర్వహించారు. మంగళవాద్యాలతో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాయం కాలార్చన, విష్వక్సేన పూజ, పుణ్యహవాచనం, దీక్షాచరణ, అంకరార్పణ, అజస్రదీపారాధన, ధ్వజపట ప్రతిష్ఠ విశేష పూజ, బలిహరణ, మంత్రపుష్ప నీరాజనం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు ఆలయ అర్చకులు, ఈవో కొత్తూరు జగన్మోహనరావు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం..

మామిళ్లగూడెం రామాలయం రోడ్‌లోని డైమండ్ టవర్స్‌లో మంగళవారం రాత్రి 8 గంటలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పర్సా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పర్సా వెంకటలక్ష్మీ, నరసింహారావు , కొండపల్లి శ్రీభార్గవ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే కళ్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా శ్రీనివాస పరిణయం



కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

మధిరటౌన్, మే20: మధిర బంజారా కాలనీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి స్వామి వారికి శ్రీదేవి, భూదేవి లతో అంగరంగ వైభవంగా నిర్వహించిన కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. స్వామి వారు అమ్మ వార్లకు దేవాలయ కమిటీ అధ్యక్షులు గుర్రం రామారావు, ప్రమీల దంపతులు పట్టు వస్త్రాలను అందచేసారు. సోమవారం గరుడోత్సవం, చక్రస్నానం నిర్వహించి స్వామి వారు అమ్మ వార్ల ఊరేగింపును నిర్వహించారు.

చూడముచ్చటగా...

వేంసూరు, మే 20: వేంసూరు మండలం రాయుడుపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

విప్లవ ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం

గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రయ్య



మాట్లాడుతున్న పడిగ యర్రయ్య

ఏన్కూరు, మే20: విప్లవ ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య అన్నారు. సోమవారం లచ్చగూడెం గ్రామంలో యూసీసీఆర్ఐ(ఎంఎల్) ఉమ్మడి జిల్లా ఎన్నికల సమీక్షా సమావేశం కల్తీ రామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఎర్రయ్య పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి నిరోధక బీజేపీని ఓడించాలని సూచించారు. భూస్వామ్య విధానం రద్దు దున్నేవానికి భూమి వ్యవసాయ విప్లవం ద్వారానే సాధించడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నో సాహిత్యాలు, సైద్ధాంతిక పరమైన విషయాలు అదించిన గొప్ప సిద్ధాంతకర్త దేవులపల్లి వెంకటేశ్వరరావు సూచించిన మార్గంలో పయనించాలన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర నాయకులు పోలెబోయిన ముత్తయ్య, షేక్ సోందు మియా, జక్కం శ్రీను, డీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి కల్తి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి

» చీఫ్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ హనుమంతరావు



మాట్లాడుతున్న హనుమంతరావు

ఖమ్మం రూరల్, మే 20: నేషనల్ లీగల్ సర్వీస్ సెల్ అథారిటీ ప్రవేశపెట్టిన ఉచిత న్యాయసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ చీఫ్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్, ప్రముఖ న్యాయవాది మామిడి హనుమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాలో జిల్లా లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ తొర్రికుంట శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ రవి, ఎస్‌డబ్ల్యూసీ వర్కర్స్ మురామేస్త్రీలు వై.ఉపేందర్, కుమార్, ఆటో యూనియన్ నాయకులు రావుల శ్రీనివాసరావు, గురవయ్య, గోపి పాల్గొన్నారు.

రాయితీపై పచ్చి రొట్టవిత్తనాలు

కారేపల్లి, మే20: మండల పరిధిలోని రైతులకు 60శాతం రాయితీపై అందజేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి కర్నాటి ఉమమాహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ ద్వారా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 28టన్నుల జీలుగులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో బొల్లు హనుమంతరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులివ్వాలి

తిరుమలాయపాలెం, మే20: పేదలందరికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని, రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు కె.నాగేశ్వరావు కోరారు. సోమవారం పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ స్మారక భవనంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు అవసరం ఉందని, లేకపోవడంతో వారికి వివిధ సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. ఈ సమావేశంలో యడ్లపల్లి నవీన్, రాయిండ్ల చిరంజీవి, ఆరెంపుల వెంకన్న, మీగడ సత్యం, పాల్గొన్నారు.

రేపు సత్తుపల్లికి తీన్మార్ మల్లన్న

వేంసూరు, మే 20: ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ నియోజకవర్గాల పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఈనెల 22న సత్తుపల్లికి రానున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మర్లపాడులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పుచ్చకాయల సోమిరెడ్డి, ఎర్రా సత్యనారాయణ, గడిపర్తి శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలకు బంగారు పతకాలు



బంగారు పతకాలు అందుకున్న సునీత, రజిని, పణికుమారి

వైరా, మే 20: భగవద్గీత 18 అధ్యాయాల్లోని శ్లోకాలను పఠించిన వైరాకు చెందిన ముగ్గురు మహిళలు గణపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా బంగారు పతకాలు అందుకున్నారు. మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద దత్తపీఠం వారు ప్రపంచవ్యాప్తంగా భవద్గీత కంఠస్థ ఆన్‌లైన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వైరాకు చెందిన దోనెపూడి సునీత, రాయపూడి రజిని, వేములపల్లి పణికుమారి ప్రతిభా పాటవాలు చూపి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఆదివారం మైసూర్‌లో గణపతి సచ్చిదానంత చేతులమీదుగా బంగారు పతకాలను అందుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

మధిర, ఖమ్మం, వైరాలో మద్దతుదారుల ప్రచారం



ఖమ్మంలో వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

మధిరటౌన్/ ఖమ్మం బైపాస్ రోడ్/వైరా, మే20: ఈనెల 27 న జరుగు ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి స్థానానికి జరుగు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని ఎన్నికల మధిర నియోజకవర్గ ఇంచార్జ్ దేవకి వాసుదేవరావు కోరారు. సోమవారం మధిర లోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో బీజేపీ అభ్యర్థికి ఓట్లు వేయాలని ప్రచారం చేశారు.

నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బీజేపీ ఖమ్మం నాయకులు సోమవారం ఉదయం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కి ఓటువేసి గెలిపించడం ద్వారా నిరుద్యోగుల తరుపున ఉద్యోగుల తరుపున ప్రశ్నించే గొంతును చట్టసభలకు పంపినట్టు అవుతుందన్నారు.

బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌ను గెలిపించాలని బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ కోరారు. సోమవారం వైరాలో జరిగిన బీజేపీ వైరా నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు ప్రసంగించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ పెద్దోళ్ల గంగారెడ్డి, రాష్ట్ర నాయకులు కపిలవాయి రవీందర్, ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం జిల్లా కో ఆర్డినేటర్ దుద్దుకూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏడో డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, శ్యామ్‌రాథోడ్ , చావా కిరణ్, ఖమ్మంఅసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కేయూ వీసీపై సీబీఐ విచారణ చేపట్టాలి

» ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 20: కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగుల అక్రమ నియామకాలు, బదిలీలపై విజిలెన్స్ దాడుల నివేదికలను బహిర్గతం చేయాలని, వైస్ చాన్సలర్‌పై సీబీఐ విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస నిబంధనల మేరకు పదేళ్ల ప్రొఫెసర్‌గా అనుభవం లేని తాటికొండ రమేశ్‌కు 2021లో వీసీగా నియమించారని విమర్శించారు. గతంలో పనిచేసిన రిజిస్ట్రార్‌తో కలిసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు శివ, చందులాల్, నవీన్, నరేశ్, సతీష్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

మధిర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవి



సమావేశంలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ ముఖ్యనాయకులు

మధిరటౌన్, మే20: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను గెలిపించేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు కోరారు. సోమవారం మధిర లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 27న జరుగు ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రామాల వారిగా ఉన్న ఓటర్లను కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసేలా ప్రచారం నిర్వహించాలని మొదటి ప్రాధాన్య ఓటును మల్లన్నకు వేసేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీ, బుచ్చి రామయ్య, రాంబాబు, నాగరాజు, వంశీ, నకిరకంటి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని అదానికి కట్టబెట్టేందుకు సీఎం యత్నాలు

ప్రతిపక్షం ఉంటేనే ప్రజలకు సుపరిపాలన అందుతుంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్

ఇల్లెందు, కొత్తగూడెంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాలు



బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి గజమాలతో సత్కారం

కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి)/ఇల్లెందు, మే 20: లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సింగరేణిని ఆదాని సంస్థలకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ యత్నిస్తున్నాడని, ఈ విషయంలో చోటే బాయ్.. బడే బాయ్ ఏకమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మోసపు మాటలు, గ్యారంటీల పేరిట ప్రజలను మోసగించిన రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఇల్లెందు, కొత్తగూడెం కేటీఆర్ ఎన్నిలక ప్రచారం నిర్వహించారు. ముందుగా ఇల్లెందులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడుతూ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తాము చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోవడం వల్లనే ఓడిపోయామన్నారు. అబద్దాలను సైతం ధైర్యంగా చెప్పడంలో సీఎం రేవంత్‌కు గట్టి విశ్వాసం ఉందన్నారు. పట్టభద్రులు మరోసారి మోసపోకుండా ప్రశ్నించే గొంతుక అయిన రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌నుంచి పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న ఒక బ్లాక్‌మెయిలర్ అని ఆరోపించారు. కొత్తగూడెంలో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడుతూ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘన కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉన్నత విద్యావంతుడు, ప్రజాసేవ చేయాలనే తలంపుతో విదేశాల్లో ఉద్యోగాన్ని వదిలేసి కేసీఆర్ ఆశీర్వాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చి పట్టభద్రుదల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాకేష్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ మోసం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి బృందం బయలుదేరిందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

కామేపల్లి, మే 20: కలుపు మందు చల్లిన చేనులో మేత కోసం వెళ్లిన 200గొర్రెలు తిని మృత్యువాత పడ్డాయని, వారికి రూ.30లక్షలు నష్టం వాటిల్లిందని వారి కుటుంబాలకు నష్టం పరిహారం ప్రభుత్వం చెల్లించాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు గొర్రెలకు ప్రభుత్వం ఉచితంగా బీమా చేసిందని అన్నారు. ఈ ప్రభుత్వం ఒకసారి ఆలోచించి మళ్లీ అపథకాన్ని పునరుద్ధరించాలని కోరారు.

2,794 మంది ఎమ్మెల్సీ ఓటర్లు

కారేపల్లి మే20: మండలంలో 2,794 మంది పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని, వీరి కోసం మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేసిన్నట్లు తహసీల్దార్ సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశామని తెలిపారు.

పరుగు పందెంలో సింహాద్రికి స్వర్ణం

చింతకాని, మే 20: నాగులవంచ గ్రామానికి చెందిన యువకుడు శెట్టిపోగు సింహాద్రి జాతీయ స్థాయిలో నిర్వహించిన 1600 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. ఫిట్ ఇండియా ఫెడరేషన్ అసోసియేషన్ ఈనెల 18వ తేదీన ఢిల్లీలో నిర్వహించిన పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచాడు. సింహాద్రి స్వర్ణం గెలవడంతో జూన్ 20 తేదీ నుంచి 25 తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపాడు.